# 10. పేగుతీపి

"లే... లేచి బువ్వదినయ్యా. పొద్దుబోలా ఇంక. లేచి బువ్వదిని పడుకోక" అంది రత్తమ్మ, భర్త బుల్లియ్యతో

"ఆకలిగా లేదే!" అని అటు తిరిగి పడుకున్నాడు బుల్లియ్య.

"ఆకలి కాటం లేదంటే ఎట్ట? అదే ఆకలయిద్దిలే, లేచి రెండు ముద్దలు తిని పడుకోక.."

"ఎహై చెప్పేది నీక్కదంటే, ఒకసారి చెబితే తలకి ఎక్కదా ఏంది?" పెద్ద గొంతుతో కోపంగా కసురుకున్నాడు.

తినమని మళ్ళీ వెంటనే అడిగితే కోప్పడతాడని కొద్దిసేపు తరువాత తిరిగి అడిగింది ఆమె.

"రోజుకి నాలుగుసార్లు తినే వాడివి. నిన్నంతా తినకపోతివీ! ఇప్పుడు కూడా తినకపోతే ఎట్ట? రోజూ ఆకలో ఆకలో అంటా పొయ్యి మీద బువ్వ ఉడికీ ఉడక్కముందే పీట వేసుకుని కూచునేవాడివి, నీకు ఆకలి కాటం లేదంటే ఎవురు నమ్ముతారు?"

ఏం మాట్లాడలేదు బుల్లియ్య. అదే అవకాశంగా తీసుకుని మళ్ళీ మళ్ళీ అడిగింది ఆమె.

"ఒక్క తన్ను తన్నేనంటే మూతి పళ్ళు రాల్తయ్, చెపతంటే నీక్కదూ!" బూతు మాట తిట్టి పెద్దగా అన్నాడు.

"తంతే తన్నేవులే! నీ చేత తన్నులు తినడం అయినా నాకు ఇష్టమే కానీ బువ్వ తినకపోతే మాత్రం ఊరుకునేది లేదు. లే, లేచి బువ్వదిను.." అని పడుకున్న బుల్లియ్యని చేయి పట్టుకుని లేపడానికి ప్రయత్నించింది ఆమె.

"ఏందే ఎన్నిసార్లు చెప్పమంటా? దయిద్రపుముండా... మూతి పళ్ళు రాలాలా?'' అంటూ కోవంగా లేచి, చేయి ఎత్తి కొట్టబోయి తమాయించుకున్నాడు.

భర్త కోపం చూసి వెనక్కి తగ్గి మంచం దగ్గర నేల మీద కూర్చుంది రత్తమ్మ.

తలగడ దగ్గర ఉన్న దుప్పటి తీసి, నిండుగా ముసుగు పెట్టి పడుకున్నాడు బుల్లియ్య.

కొద్దిసేపటి తరువాత దుప్పటలో నించే వెక్కిళ్ళు పెడుతూ ఏడవటం మొదలు పెట్టాడు.

"ఊరుకోయ్యా... పసిపిల్లోడి మాదిరిగా ఎందుకు ఏడిసేది? ఇంతకీ మనరాతలు బాగలేవు. ఒకర్ని అనుకుని ఏం లాభం?" అంది రత్తమ్మ లోపల్లోపల కుళ్ళి కుళ్ళి విలపిస్తున్న భర్తని సముదాయిస్తూ.

భార్య మాటలతో బుల్లియ్యకి ఏడుపు ఇంకా ఎక్కువైంది.

రత్తమ్మ లేచి మంచం మీద భర్త ప్రక్కన కూర్చుని ప్రేమగా, ఆప్యాయంగా వంటి మీద చేతులు వేసి నిమురుతూ "ఊరుకోయ్యా... ఏడిస్తే ఆర్చేవాళ్ళూ తీర్చే వాళ్ళూ ఎవురున్నారు మనకి?" అంది లాలనగా.

"అదికాదే, వాడ్ని ఎట్టసాకేం? వాడు మనల్ని అనాల్సిన మాటలేనా అయ్యి? నోటికి ఏ మాట వస్తే ఆ మాట  అన్నాడే! కన్న కొడుకు చేత అసుంటి మాటలు పడి ఇంక బతికేది ఎందుకే?"

"ఈ రోజుల్లో అబ్బ ఎవురో! కొడుకు ఎవురో? కొడుకైతే అసుంటి మాటలు అంటాడా? ఎవురి కెవరు?" అంది రత్తమ్మ.

అంతకు ముందు రోజు రాత్రి జరిగిన విషయమే బుల్లియ్య మనసులో పదే పదే స్ఫురణకి వస్తోంది

* * *

బుల్లియ్య, రత్తమ్మ దంపతులకి ముగ్గురు కూతుళ్ళూ, ఒక కొడుకూ.

ఆడ పిల్లల తరువాత పుట్టిన వాడు అనీ, ఒక్కగా నొక్క మగ నలుసు అనీ చాలా గారాబంగా పెంచారు. కొడుకు పేరు వెంకటేశ్వర్లు.

తల్లిదండ్రులు బుల్లియ్యకి జన్మఇచ్చారే కాని సెంటు భూమి ఇవ్వలేదు. పుట్టి బుద్ధి ఎరిగిన దగ్గర్నించీ జీతాలకే ఉన్నాడు ఆయన. కష్టజీవి. బాగా పనిచేసేవాడు.

బుల్లియ్యకు ఇరవయ్యో ఏట పెళ్ళయింది. భార్య రత్తమ్మ, తనూ కష్టజీవే! జాగ్రత్త కలిగిన మనిషి.

భర్త జీతానికి ఉంటే తను కూలీ నాలీ చేసి కుటుంబాన్ని జరుపుతూ ఉండేది. పైసా ఖర్చు పెట్టే మనిషి కాదు. ముగ్గురు బిడ్డలు కలిగే వరకూ జీతం చేస్తూనే ఉన్నాడు బుల్లియ్య.

చౌకగా పొలం బేరానికి వస్తే మిగుల్చుకున్న జీతం డబ్బులతో ఎకరన్నర పొలం కొన్నాడు. జీతం మానుకున్నాడు.

తన అరగొర్రు పొలంలో రత్నాల రాశులు పండించాడు. కూతుళ్లని కూడా పొలం తీసుకుపోయి చాకిరీ చేయించాడు. తన పంట్లోనూ, ఇంట్లో జనంలోనూ చేసే సత్తా ఉందని తన పొలానికి తోడు మరో నాలుగైదు ఎకరాల పొలం కౌలుకి తీసుకున్నాడు. నాలుగేళ్ళలో మిగిలిన డబ్బుతో ఇంకో ఎకరం పొలం కొన్నాడు.

చిన్నగా ఏడాదికి ఒక్కో కూతురికి పెళ్ళిచేసి అత్తవారిళ్ళకి పంపించాడు.

తరువాత కొడుక్కీ పెళ్ళిచేశాడు.

అతను ఎకరన్నర పొలం తీసుకుని వేరుపడి, వేరే ఇంట్లోకి అద్దెకిపోయాడు.

వయసు పెరుగుతున్నా బుల్లియ్యకి పొలం మీద ఆపేక్ష తగ్గలేదు. పొలం మీద కొద్దీ గొప్పా డబ్బు వస్తుండటంతో ఒకేసారి ఎనిమిది ఎకరాలు పొలం కౌలుకి తీసుకున్నాడు. ప్రత్తి వేసాడు.

పాతిక సంవత్సరాల క్రితం రైతు సొంత శ్రమతో పాటు ఎద్దులు పెట్టుకుని వ్యవసాయం చేసి పంటలు పండించుకునే వాడు. అప్పుడు రైతుకి నష్టం అంటే ఏమిటో తెలియదు. పెట్టుబడి అవసరం పెద్దగా ఉండేది కాదు. కష్టమే తప్ప బాధలు లేవు. గొడ్ల మేతకీ, తిండి గింజలకీ తిరుగు ఉండేది కాదు.

ఇవ్వాళ ఆ పరిస్థితి లేదు.

వ్యవసాయ రంగంలో బహుళజాతి కంపెనీలు ప్రవేశించాయి. వాళ్ళ దోపిడీ ప్రవేశించింది. దోపిడీ వెంటే దుర్మార్గం కూడా!

మొట్టమొదట విత్తనాల దగ్గర్నించే దోపిడీ ఆరంభమవుతుంది.

కేజీ ప్రత్తివిత్తనాలు వెయ్యి రూపాయలు! ఇక ఎరువులు, పురుగు మందులు ధరలు చెప్పేపనిలేదు. ఒక రైతు తన పొలానికి పెట్టే పెట్టుబడిలో 80, 90 శాతం ఏదో రూపంలో బహుళజాతి కంపెనీలకి సమర్పించుకోవాలి.

పంట పండితే పదిరూపాయలు మిగుల్తాయి. లేకుంటే అప్పులు మిగుల్తాయి.

బుల్లియ్యకి అదే పరిస్థితి అయింది.

ప్రత్తి నిండా విపరీతంగా పురుగు.

తెల్సినవాళ్ళ దగ్గరా, పరిచయస్తుల దగ్గర వేలాది రూపాయలు అప్పు తీసుకొచ్చి పురుగుచావడం కోసం వెనుకంజ వేయకుండా మందు చల్లాడు.

పురుగు పోలేదు కానీ డబ్బులు పోయాయి. చేలో చేసిన చాకిరీ, ఇంటి దగ్గర అప్పు మిగిలింది.

పంట అయిన తరువాత లెక్క చూసుకుంటే గుండెలు గుభేలు మన్నాయి. కాస్తా కూస్తా కాదు, 60 వేలు అప్పు తేలాడు.

తన ఎకరం పొలం మీద తనకి అయిన అప్పుకాదు, ఆ అప్పుకి వడ్డీ కూడా తీర్చడం జరిగే పనికాదు.

అప్పు అంటే నిప్పే! వడగాలి నిప్పు. సురవేసుకుపోతుంది!

వేరుగా ఉంటున్న కొడుకు రెండు మూడు రోజులకోసారి వచ్చి అమ్మనీ, నాన్ననీ పలకరించి పోతాడు.

కొడుకు వస్తే ,విషయం చెప్పాడు బుల్లియ్య.

"ఎట్ట చేద్దామయ్యా? చాలా అప్పు తేలాం. వడ్డీతో వడిగల గుర్రం కూడా లగెత్తలేదంట! రోజు రోజుకీ వడ్డీలు పెరిగిపోతంటయ్యి. తరువాత తీర్చాలంటే చచ్చేచావు!"

"కన్ను పోయేటంత కాటికి ఎందుకు నాయనా? నీకు ఉన్న ఎకరానికి తోడు ఇంకో ఎకరం మగతాకి తీసుకుంటే చాలదూ? బీపీ, షుగరూ రెండు జబ్బులూ ఉండె! ఎల్లకాలం ఏం చేస్తా? పుట్టినప్పట్నించీ చేసీ చేసీ నాడులు కుంగిపోయిందాకా చేస్తివి! ఇంకెంతకాలం చేద్దామని నీబెమ? తేడా పడి మంచంలో పడితే ఎవురు చూస్తారు నిన్ను?" అని కొడుకు మమకారంతో మందలించాడు.

"ఇప్పుడు ఏం చేయమంటావో చెప్పయ్యా?"

"చేసేదేముంది? పొలం అమ్మి బాకీ తీర్చు"

"పొలం పోతే రాదు. పొలం నువ్వే ఉంచుకుని బాకీ తీర్చరాదూ! నీ దగ్గర డబ్బులు ఉండయి గదా?"

"నాకు ఎందుకు నాయనా పొలం? నేను పొలం చేసేవాడ్ని కాదూ, పెట్టే వాడ్ని కాదూ! అసలు పొలం పనిచేసి ఎవుడు బాగుపడ్డాడు? నేను యేపారం చేద్దామనుకుంటున్నా!" అన్నాడు కొడుకు.

బుల్లియ్య పొలం 65 వేలకి అమ్మి బాకీలు మొత్తం తీర్చాడు. బాకీలు పోగా 3 వేలు మిగిలాయి.

"రెండెకరాలు మగతాకి తీసుకుని పంట వేద్దామే ఇయ్యేడు. పొలంలో వచ్చిన దండగని పొలంలోనే పూడ్చుకోవాలి. నాలుగు రూపాయలు సంపాయించుకుని దాచుకుంటేనే రేపు ముసలి తనంలో పిల్లలు అమ్మా నాయనా అంటారు కానీ చేతిలో డబ్బు లేకపోతే దగ్గరికి రానిస్తారూ?" అన్నాడు బుల్లియ్య.

రత్తమ్మ కూడా సరే నంది.

పొలం మగతాకి తీసుకుంటానని కొడుకుతో చెప్పాడు బుల్లియ్య.

"ఎందుకు నాయనా లేనిపోని తలకాయ నొప్పి? ఓపిక ఉంటే కూలికిపోయి పని చేసుకో! ఓపిక లేదంటావా, చౌకడిపో బియ్యం ఇప్పిస్తా తిని పడి ఉండు" అన్నాడు అతను.

"ఇప్పట్నించే నీ మీద ఎక్కడ పడేమిరా? శక్తి ఉన్నంతకాలం చేసుకుంటే తరవాత ఎవారం తరవాత..." అని, కొడుకు మాటని తిరస్కరించి పొలం కౌలుకి తీసుకున్నాడు

అప్పు తీసుకొచ్చి, కౌలు కట్టి, పొలంలో పంట వేశాడు.

వర్షాలు లేక నష్టం వచ్చింది.

బాకీ ఎలా తీర్చాలి?

ఆదాయం లేదు. ఆస్తిలేదు. రెక్కలు తప్ప మరో ఆధారం లేదు.

కాలం గడిచిపోతూ ఉంది. బాకీల వాళ్ళు ఎంతకాలం ఆగుతారు? రోజూ వచ్చి గొడవ చేసి పోతున్నారు.

బుల్లియ్య దిగులు పడిపోయాడు. ఎన్నో ఏళ్ళు కష్టపడి సంపాదించుకున్న ఎకరం భూమి పోయింది. మళ్ళీ బాకీలు అయ్యాయి. ఈ బాకీలు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

అంతకు ముందు రోజు రాత్రి...

కొండయ్య అనేవాడు వచ్చి బాకీ డబ్బు అడిగాడు.

"ఇట్ట ఎన్నిరోజులు తిప్పిచ్చుకుంటా? మాకు నీ చుట్టూ తిరగడమే పనా? చెయ్యను చేత కానోడివి పొలం ఎందుకు తీసుకోవాలీ, బాకీలు ఎందుకు చెయ్యాలీ, మమ్మల్ని ఇంటి చుట్టూ ఎందుకు తిప్పించుకోవాలీ? నాకు డబ్బు ఎప్పుడు ఇస్తావో చెప్పు?" అని కూర్చున్నాడు.

ఆ కొండయ్య అనేవాడు పరమ కర్కోటకుడు.

పది రూపాయలు వడ్డీకి పేదలకి అప్పు ఇచ్చి, వాళ్ళు గడువులోపు బాకీ ఇవ్వలేకపోతే పొయ్యి మీద ఉడుకుతున్న అన్నంకుండని మసిగుడ్డతో

అలాగే తీసుకుపోతాడు. ఉడికిన కుండని అయినా తీసుకుపోతాడు. అది వాడి పద్ధతి.

అన్నం కుండని తీసుకుపోతే ఆ రోజు వాళ్ళు పస్తు పడుకోవాలి.

అతనికి వూళ్ళో కనీస విలువలేదు. కనీసగౌరవం లేదు. ఎవరైనా అతని ముఖాన్నే తుపుక్కుమని వూస్తారు.

కొండయ్య వచ్చి డబ్బు అడుగుతున్న సమయంలోనే బుల్లియ్య కొడుకు వెంకటేశ్వర్లు కూడా వచ్చాడు. అప్పుడు వెంకటేశ్వర్లు తాగి ఉన్నాడు.

"నువ్వుఎంత చేసూ, నీ బాకీ ఎంత చేసురా? మా నాయన్ని పట్టుకుని చేతా వాతా కానోడు అంటావా?" అంటూ అతనిని బండ బూతులు తిట్టాడు.

అతను కూడా తగ్గలేదు. ఘర్షణైంది. బూతులు తిట్టుకున్నారు.

వారం రోజుల్లో ఇవ్వాలని గడువుపెట్టి అతను వెళ్ళిపోయాడు.

కొండయ్య వెళ్ళిన తరువాత వెంకటేశ్వర్లు తల్లినీ, తండ్రినీ ఇద్దర్నీ కలిపి నీచాతినీచంగా తిట్టాడు.

అతనికి అమ్మా నాయన అంటే చాలా ప్రేమ. ఎంతో ఇష్టం. ఎప్పుడూ వాళ్ళని చిన్నమాట అని కూడా ఎరుగడు. ఆ తండ్రీ కొడుకుల మధ్య పేగుతీపి అపురూపంగానే ఉంది.

కానీ, తాగి ఉండటం, తను పొలం వేయొద్దంటే తన మాట వినకుండా వేయడం, పైగా కొండయ్య లాంటి వాడి దగ్గర అప్పు తీసుకురావడం, అప్పుడే వాడికీ తనకీ ఘర్షణ పడటం వీటితో వెంకటేశ్వర్లు అమ్మా నాయనని నోటికి వచ్చినట్లు తిట్టి ఇంటికి వెళ్ళిపోయాడు.

* * *

విషయం గుర్తు వచ్చిన బుల్లియ్యకి కళ్ళలో నీళ్ళు సుడులు సుడులుగా తిరిగాయి.

"ఊరుకోయ్యా... లే, లేచి బువ్వదిను" అని రత్తమ్మ బతిమాలి, చిన్నగా బుల్లియ్య చేయి పట్టుకుని మంచం మీద నుంచి లేపి, చెంబుతో నీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది.

బుల్లియ్య అక్కడే కాళ్ళూ చేతులూ కడుక్కుని వెళ్ళి పీట వాల్చుకుని కూర్చున్నాడు.

రత్తమ్మ కంచంలో అన్నం పెట్టి, పప్పు చారు పోసి బుల్లియ్య ముందు పెట్టింది.

బుల్లియ్య తినకుండా అలానే అన్నం కలుపుకుంటూ కూర్చున్నాడు.

"బువ్వని ఎంతసేపు పిసుకుతా కూచుంటా, కానిచ్చి తినక! అయిందేదో అయిపోయింది. జరిగిపోయిన దానికి బాధపడతా కూచుంటే ఎట్ట? తినయ్యా..."

"నాకు అన్నం తినబుద్ధి కావటం లేదే! ఈ బాకీలేందీ, కొండి గాడి చేత మాట పట్టం ఏందీ, బిడ్డ కూడా ఎట్టంటే అట్ట మాట్టాట్టం ఏందీ? నాకు ఇంక బతకాలని లేదే! బతికేం సాదిచ్చాలి ఇంక?"

"ఏం మాటలయ్యా? మనకేం లోటు? మీ అయ్యనీకు మడులూ మాన్నేలూ ఇచ్చాడా? రెక్కల మీనే రెండున్నర ఎకరాల భూమి సంపాయిచ్చుకున్నాం. సరే కాలం కలిసిరాక అందులో ఎకరం అమ్మేసుకున్నాం అనుకో! మనం సంపాయిచ్చిందే అమ్ముకున్నాం కానీ పెద్దోళ్ళు ఇచ్చిందేం కాదుగా?" భర్తని శాంత పరిచే ఉద్దేశంతో రత్తమ్మ మాట్లాడింది.

"ఒకాళ నేను చచ్చిపోతే నువ్వు దిగులు పడవాకవే! పెద్ద అమ్మాయి దగ్గరికి పోయివుండు. పెద్దమ్మాయి మొగుడు మంచోడు. నిన్ను బాగా చూసుకుంటాడు!"

"ఏం మాటలు ఊరుకోయ్యా? అట్ట మాట్టాడతన్నావేందీ? ఏమైంది నీకియ్యాల? మంచోడివో నా పీడబాయి!" రత్తమ్మ కోప్పడింది.

బుల్లియ్య ఏం మాట్లాడలేదు. దీర్ఘంగా ఆలోచిస్తూ గంటసేపు అన్నం తిన్నాడు.

అప్పటికే బాగా పొద్దు పోయింది. ఊరు ఎప్పుడో మాటుమణిగింది.

మంచంమీద పడుకున్నాడు కానీ ఎంతకీ నిద్రరావడం లేదు బుల్లియ్యకి. చొక్కాకి లోపలున్న జేబు తడిమి చూసుకున్నాడు. యాభై రూపాయల కాగితాలు రెండు నలిగిపోయి ఉన్నాయి.

రాత్రి నిద్ర పట్టక పొద్దుపోయి పడుకోవడంతో ఎండబడి లేచింది రత్తమ్మ.

ఇంటి ముందు అంట్లు వేసుకుని బూడిదపెట్టి తోముతూ కూర్చుంది. అప్పటికే బుల్లియ్య లేచి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

వెంకటేశ్వర్లు చేతిలో టిఫిన్ క్యారియర్ తీసుకుని "నాయన ఎక్కడికి పోయాడమ్మా?" అంటూ వచ్చాడు.

రత్తమ్మ ఏం మాట్లాలేదు. కనీసం తల కూడా ఎత్తలేదు.

"నిన్నేనే... నాయన ఎక్కడికి పోయాడు?"

"ఏమో.." ముక్తసరిగా అంది.

"ఇదిగో టిఫినీ లోపలపెట్టు, నాయనకి ఇష్టమని చెప్పి కోడిని కోసి మాంసం తీసికొచ్చా! నాయన కొద్దిగా నువ్వు కొద్దిగా తినండి"

"ఎందుకు నాయనా ఇప్పుడు అయన్నీ" నిష్ఠూరంగా అంది రత్తమ్మ.

"ఎందుకేందే! పరాయోడ్ని చేసి మాట్టాడతావేంది? నిన్న అసలు నాకు బువ్వే తినబుద్ధికాలా! మిమ్మల్ని అనవసరంగా తిట్టానే అని నిన్నంతా దిగులు పట్టంతోనే సరిపోయింది. నాలుగు రూపాయలు వస్తయ్యనేగా మీరు మాత్రం పొలం వేసింది. దండగ వస్తే ఎవరేం చేస్తాం అనుకో!"

"నిన్నంతా మీ నాయన ఎంతగా ఏడ్చాడో..."

"సరే, అయిపోయిందేదో అయిపోయిందిలే! ఆ రోజు నాకు ఏదో పెద్దమ్మారు నెత్తికి ఎక్కింది. ఏం మాట్టాడతన్నానో, ఏం చేస్తన్నానో నాకే తెలియలా! సరే నాయన వస్తే వచ్చి పోయానని చెప్పు. మళ్ళొస్తాలే!" అంటూ వెంకటేశ్వర్లు వెళ్ళిపోయాడు.

వేకువ జామునే లేచి బుల్లియ్య పొరుగునే ఉన్న రావినూతల వెళ్ళాడు.

అక్కడ పురుగు మందుల కొట్లో జేబులో ఉన్న డబ్బుపెట్టి పెసర పైరుకి వేయాలని పావులీటరు ఎండోసల్ఫాన్ మందు కొన్నాడు.

కొడుక్కి ఇచ్చిన పొలం రావినూతలకీ, తమ ఊరికీ మధ్యలో ఉంటుంది.

మందు తీసుకుని వడివడిగా నడుచుకుంటూ చేలోకి వచ్చాడు.

తను చెమట చిందించి సంపాదించుకున్న భూమి ఇది. పిల్లలు గలవాడు అని కొడుక్కి ఇచ్చాడు. వాడంటే తనకి ప్రాణం! ఈ భూమి కూడా తనకిప్రాణమే! వాడు ఈ భూమిని కాపాడుకుంటాడో, అమ్ముకుంటాడో!

పొలంలో పెసర వంట నవనవలాడుతూ పూతపిందెలతో కళకళలాడుతోంది. మందళ్ళలో జొన్నపైరు. బుల్లియ్య జొన్న పన పీకి, నేల మీద పరుపు మాదిరిగా పేర్చుకున్నాడు. దాని మీద పడుకొని మందు డబ్బా మూత తీసి గట గట తాగాడు.

పరగడుపుతోనే తాగడంతో మందు శరీరంలో త్వరగా ఇంకిపోయింది.

వేళకి, కూలీలు దారిన పొలం వెళుతూ, చేలో బుల్లియ్య పడి ఉండటం చూసి, ఒకరు పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్ళి రత్తమ్మకీ, కొడుక్కీ విషయం చెప్పారు.

ఊళ్ళో నించి పిల్లలూ, పెద్దలూ చాలా మంది పరిగెత్తుకుంటూ దండు మాదిరిగా చేలోకి వచ్చారు.

బుల్లియ్య ప్రాణాలు పోయి అప్పటికే చాలా సేపు అయ్యింది.

నడుస్తున్న చరిత్ర మాసపత్రిక – జూన్, 2004